క్లుప్తంగా

ఏపీ ఆర్జేసీలో మైదుకూరు విద్యార్థినికి 105వ ర్యాంకు


విద్యార్థిని భవ్యశ్రీ

మైదుకూరు : ఏపీఆర్జేసీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మైదుకూరు మున్సిపాలిటీకి చెందిన బి.భవ్యశ్రీ అనే విద్యార్థినికి రాష్ట్రస్థాయిలో 105వ ర్యాంకు లభించింది. గుంటూరు కొట్టాలు గ్రామానికి చెందిన బైసాని నరసింహారెడ్డి అనే రైతు కుమార్తె భవ్యశ్రీ పదో తరగతి పరీక్షల్లో 547 మార్కులు సాధించింది. ఏపీ ఆర్జేసీలో 150 మార్కులకు గాను విద్యార్థిని 124 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 105వ ర్యాంకు సాధించింది. విద్యార్థినిని గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రారంభమైన గంగమ్మ జాతర


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

దువ్వూరు : మండల పరిధిలోని నారాయణపల్లె గ్రామంలో గురువారం గంగమ్మ జాతర మహోత్సవం ప్రారంభమైంది. 8న గురువారం ప్రారంభమైన జాతర ఉత్సవాలు సోమవారం వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర సందర్భంగా ఉదయం 8 గంటలకు గ్రామ దేవతలకు పూజలు, 10 గంటలకు బొల్లేవు, గంగాపెట్టె గ్రామ ప్రవేశం చేశారు. రాత్రి 9 గంటలకు జల్ది, అఖండ స్థాపన, కలశస్థాపన కార్యక్రమాలు జరిపారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గంగమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని గురువారం ఇస్కాన్ బృందం సన్మానించింది. స్థానిక జూటూరు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న ఇస్కాన్ టెంపుల్‌కు మున్సిపాలిటీ పన్ను మినహాయింపు ఇచ్చారు. ప్రతి ఆరు నెలలకోమారు రూ.లక్షా 15వేలు పన్ను కట్టాల్సి వచ్చేదని, ఎమ్మెల్యే చొరవతో తమకు ఆ భారం తప్పిందని ఈ సందర్భంగా ఇస్కాన్ సభ్యులు తెలిపారు.

ఎండీయూలపై దాడులు అరికట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

మైదుకూరు : రేషన్ పంపిణీ వాహన ఆపరేటర్లపై దాడులను అరికట్టాలని కోరుతూ గురువారం మైదుకూరులో ఎండీయూ ఆపరేటర్లు ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి తెలుగుగంగ కాలనీలోని తహసీల్దార్ కార్యాలయం వరకు వారు ర్యాలీ నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఎండీయూ ఆపరేటర్లు మాట్లాడుతూ మండలంలోని పప్పనపల్లె ఎస్సీ కాలనీలో ఎండీయూ ఆపరేటర్‌పై స్థానికులు దాడి చేశారని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరినట్టు పేర్కొన్నారు.

ఆంగ్ల భాషలో పట్టు సాధించాలి

పోరుమామిళ్ల : విద్యార్థులు ఆంగ్లభాషలో పట్టు సాధించినపుడే ఉన్నత స్థితికి చేరగలరని స్టేట్ రిసోర్స్ పర్సన్, ఆంగ్ల భాషా నిపుణులు గంగయ్య పేర్కొన్నారు. స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న సమ్మర్ క్యాంపులో గురువారం పాల్గొన్న గంగయ్య విద్యార్థులకు ఆంగ్ల భాష ప్రాధాన్యత గురించి వివరించారు. స్పోకెన్ ఇంగ్లీష్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పతి అవార్డు గ్రహీత దాదాపీర్, గ్రంథాలయ అధికారి ఆఫ్రిది పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట

కాశినాయన : మండలంలోని మూలపల్లె గ్రామంలో సీతారామాలయంలో గురువారం సీతారామలక్ష్మణ ఆంజనేయ విగ్రహ, ధ్వజ ప్రతిష్ట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. విగ్రహమూర్తులకు వేద పండితులు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి విగ్రహ, ప్రాణప్రతిష్ట చేశారు. ఈ మహోత్సవంలో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ రమణారెడ్డి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పోరుమామిళ్ల : మండలంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు నాగలకుంట్ల సచివాలయం నుండి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. మధ్యాహ్నం 2–30 గంటలకు ముసల్‌రెడ్డిపల్లెలో గడప గడప కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, మండల స్థాయి నాయకులు పాల్గొంటారన్నారు.

స్వప్రయోజనాల కోసమే వరద విమర్శలు


ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : తన రాజకీయాల స్వప్రయోజనాల కోసమే మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తనపై దిగజారుడు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అసాంఘిక కార్యక్రమాలతో తనకు సంబంధం లేదని దైవసాక్షిగా, బిడ్డల సాక్షిగా పదే పదే చెబుతున్నానన్నారు. వరదకు దేవుడు అంటే నమ్మకం లేదు, దేవుడిని పూజించరని అన్నారు. నందం సుబ్బయ్య హత్యతో తనకు సంబంధం లేదని చౌడేశ్వరిదేవి ఆలయంలో ప్రమాణం చేశానని తెలిపారు. తన అవినీతిపై విచారణ చేయాలని ఏకంగా సీబీఐని కోరిన రాష్ట్రంలో మొదటి ఎమ్మెల్యే తాననేనన్నారు. ఇన్ని చెప్పినా పదే పదే విమర్శించడం తగదని తెలిపారు. పత్తిగింజ మాదిరి ఎదుటి వ్యక్తులను విమర్శించడం, ఇతరులకో న్యాయం, తనకు మరో న్యాయం పాటించడం వరదకు అలవాటేనన్నారు. డీఏడబ్ల్యూ కళాశాల స్థలం అమ్మకానికి సంబంధించి మూడు ఎకరాల స్థలాన్ని వాటాగా తీసుకుని అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డితో సంతకం చేయించలేదా అని ప్రశ్నించారు. విజయవాడలో ఆడిటర్‌ను హత్య చేయలేదా అని అన్నారు. వయసును ఉద్దేశించి మాట్లాడుతూ 82 ఏళ్ల అంటే ఆయన బాధపడుతున్నాడని, ఆయన వయసు 28 ఏళ్లే అని ఎమ్మెల్యే వ్యంగంగా అన్నారు.

జగన్ పోషక విలువలు కలిగిన బియ్యాన్ని ఇస్తున్నారు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక పేదల కోసం పోషక విలువలు కలిగిన బియ్యాన్ని చౌకదుకాణాల ద్వారా అందిస్తున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. గతంలో 25 శాతం నూక ఉండేదని, ప్రస్తుతం 15 శాతానికి తగ్గించారన్నారు. సన్నబియ్యంలో పోషక విలువలు కలిపి ప్రజలు అందిస్తున్నారని తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

సోములవారిపల్లె గ్రామ పంచాయతీ ఈశ్వర్‌రెడ్డినగర్‌లో రూ.40లక్షలతో నిర్మించనున్న సిమెంటు రోడ్లుకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, సర్పంచ్ ప్రశాంతి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీటీసీలు గోటూరు బాలగురమ్మ, లక్ష్మీదేవి, మహబూబ్ బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్, నాగరాజు, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి


ప్రభుత్వ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారురాలికి అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు/పోరుమామిళ్ల : ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. గురువారం పోరుమామిళ్ల మండలంలోని సంచర్ల పంచాయతీ పరిధి నాగలకుంట్ల, రామేశ్వరం, బూరగమానుపల్లె, ఎస్సీకాలనీ, కృపానగర్‌లో ఆమె గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను వారికి వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను అన్నింటిని నెరవేర్చిందన్నారు. అదే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని ధైర్యంగా కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ ముత్యాలప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ సి.బాష, వైస్ ఎంపీపీ చెన్నురాజశేఖర్, రంగసముద్రం, సంచర్ల సర్పంచ్‌లు చిత్తారవిప్రకాష్‌రెడ్డి, దస్తగిరి, ఎంపీటీసీ రవికుమార్, చిత్తాగిరిప్రణీత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గంగయ్య, చంద్రయ్య, ఎంపీడీఓ నూర్జహాన్, పంచాయతీ కార్యదర్శి అశోక్‌కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో కాన్పుల సంఖ్య పెరగాలి

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వాసుపత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో వసతులు కల్పిస్తోందని, ఈ క్రమంలో ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెరిగేందుకు వైద్యాధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రూ.6 లక్షలు వ్యయంతో ఆధునీకరించిన ప్రసూతి విభాగాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య, ఆరోగ్యశాఖ, స్త్రీశిశు సంక్షేమ శాఖ సమన్వయంతో పనిచేసి ప్రభుత్వాసుత్రుల్లో అధిక శాతం ప్రసవాలు జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు కూడా అంకిత భావంతో పనిచేసి ప్రభుత్వ వైద్యం పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని సూచించారు. అనంతరం కాన్పుల వార్డులో బాలింతలతో మాట్లాడి వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ గోపాలస్వామి, మున్సిపాలిటీ కన్వీనర్ యద్దారెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు గురివిరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సి.నారాయణ, ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ రాంప్రసాద్, ఎంపీడీఓ రామకృష్ణయ్య, ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ రామలక్ష్మి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ నిఖిల్, డాక్టర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పసుపు కొనుగోళ్లలో నిబంధనలు సడలించండి


ఎమ్మెల్యే రఘురామిరెడ్డితో మాట్లాడుతున్న బీజేపీ, సీపీఐ నాయకులు

మైదుకూరు : రైతుల నుంచి పసుపు పంటను కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం నిబంధనలను సడలించాలని బీజేపీ, ఏపీ రైతు సంఘం, సీపీఐ నాయకులు కోరారు. గురువారం మైదుకూరులోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పసుపు కొనుగోళ్ల పరిశీలనకు కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డితో వారు మాట్లాడారు. పసుపు కొమ్ములను జల్లెడ పట్టడం, గ్రేడింగ్ చేయడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. దానిపై ఎమ్మెల్యే రఘురామిరెడ్డి స్పందిస్తూ, రైతులు నష్టపోకూడదన్న ఉద్దేశంతోనే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మాచనూరు సుబ్బరాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, స్థానిక నాయకులు ఆర్.రామకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మీదేవి, శేఖర్‌రెడ్డి, రాజమోహన్‌రెడ్డి తదితరులు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, సహాయ కార్యదర్శి చిలుంగారి పెద్దపుల్లయ్య, సీపీఐ నాయకులు శ్రీరాములు, ఏవీ శివరామ్, రామ్మూర్తి, గంగయ్య మార్క్‌ఫెడ్ డీఎం నరసింహారెడ్డితో చర్చించారు.

ఉత్సాహంగా సాగిన 'చదవడం మాకిష్టం'

- నేటితో విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరాలు ముగింపు
- నేడు బహుమతి ప్రదాన సభ

కడప కల్చరల్ : కథలంటే పిల్లలకే కాదు...పెద్దల కూడా కూడా ఇష్టమే. ముందుతరంలో పెద్దలు చిన్నారులకు కథలు చెప్పేవారు. ఇప్పుడు ఆ అవసరాన్ని గ్రంథాలయాలు తీరుస్తున్నాయి. చిన్నారుల్లో చదివే గుణాన్ని పెంచడంతోపాటు ఆలోచన, సమయస్ఫూర్తి, సమస్యల పరిష్కారం, ఆత్మస్థైర్యం తదితర అంశాలను పెంచే కథలను గ్రంథాలయాలు చిన్నారుల వేసవి శిబిరాలకోసం ప్రత్యేకంగా రూపొందించి అందుబాటులో ఉంచాయి.

×చదవడమంటే మాకిష్టం. అందులోనూ కథలు చదవడం అంటే మరీ ఇష్టం అంటున్నారు చిన్నారులు. 30 రోజుల విద్యార్థుల వేసవి శిక్షణా శిబిరాలు జిల్లా అంతటా విజయవంతంగా సాగాయి. ఈ ఉత్సాహంతో గ్రంథ పాలకులు, అధికారులు శుక్రవారం ముగింపు ఉత్సవాలను నిర్వహించనున్నారు. శిబిరాలలో ప్రతిభ చూపిన చిన్నారులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేయనున్నారు.

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్‌గా విద్యాధికురాలైన లింగాల ఉషారాణి రావడంతో జిల్లా గ్రంథాలయ సంస్థ వేసవి శిక్షణా శిబిరాల్లో ప్రత్యేకించి చదవడం మాకిష్టం కార్యక్రమానికి కొత్త జోష్ లభించింది. ఆమె స్వయంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంతోపాటు దాదాపు అన్ని శాఖా గ్రంథాలయాలకు వెళుతూ వేసవి శిబిరాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. దీంతో గ్రంథాలయ అధికారులు, సిబ్బంది కూడా ఉత్సాహంగా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి విద్యార్థులతో అమలు చేయించారు. ఈసారి ఎండలు అసాధారణంగా ఉండడంతో శిక్షణా శిబిరాలకు వచ్చే విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సంస్థ చైర్ పర్సన్, కార్యదర్శి అమీరుద్దీన్, ఇతర సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. చిన్నారులకు వడదెబ్బ తగలకుండా ఎప్పటికప్పుడు హోమియో మందులు అందజేస్తూ చల్లని తాగునీటిని అందుబాటులో ఉంచడమే కాకుండా అన్ని పూటల మజ్జిగను అందజేశారు.
- జిల్లా గ్రంథాలయం నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు సభను శుక్రవారం ఉదయం 9.00 గంటలకు నిర్వహించనున్నారు. నగరంలోని సీపీ బ్రౌన్ గ్రంథాలయంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి చైర్ పర్సన్‌తోపాటు విద్యాశాఖ, అనుబంధ శాఖల అధికారులు హాజరు కానున్నారు. శిబిరాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు వారు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించి ఆశీర్వదించనున్నారు.

సురేష్ హాస్పిటల్ ప్రారంభం


ఆస్పత్రి నిర్వాహకులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని సాయికుటీర్ రోడ్డులో ఉన్న త్యాగరాజరెడ్డి హాస్పిటల్ కాంపౌండ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సురేష్ న్యూరో, జనరల్, చిన్న పిల్లల హాస్పిటల్‌ను గురువారం ప్రారంభించారు. ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ మందాది సురేష్‌రెడ్డి, యాపర్ల సింధూరలు కుటుంబ సభ్యులతో పూజా కార్యక్రమాలు నిర్వహించి హాస్పిటల్‌ను ప్రారంభించారు. ప్రత్యేక వైద్య నిపుణుడు డాక్టర్ మందాది సురేష్‌రెడ్డి నిమ్స్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ తీసుకున్నారు. అలాగే హైదరాబాద్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో నియోనటాలజీలో డాక్టర్ యాపర్ల సింధూర శిక్షణ పొందారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు సురేష్‌రెడ్డి, సింధూర మాట్లాడుతూ తమ ఆస్పత్రిలో ఫిట్స్, పక్షవాతం, నరాల బలహీనత, నరాల సమస్య, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, మంటలు, మెదడులో రక్తం గడ్డ కట్టుట తదితర జబ్బులకు 24 గంటల ఔట్ పేషెంట్ ఓపీ సేవలు, 24 గంటల శిశువు మరియు పిల్లలకు అత్యవసర చికిత్స సదుపాయం ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, మల్లేల లింగారెడ్డి, మున్సిపల్ చైర్మన్ లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు శివచంద్రారెడ్డి, డాక్టర్ త్యాగరాజరెడ్డి దంపతులు, పట్టణంలోని ప్రముఖ వైద్యులు పాల్గొన్నారు.

బాధ్యతలను కర్తవ్యదీక్షతో నిర్వహించాలి

- సిబ్బందికి వీసీ సూచన


వసతిగృహాల సిబ్బందితో మాట్లాడుతున్న వీసీ సుధాకర్, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

వైవీయూ : విద్యార్థులు ఉంటేనే మనమనందరం ఉన్నామనే విషయాన్ని గుర్తుంచుకుని ఎవరి బాధ్యతలు వారు కర్తవ్యదీక్షతో నిర్వహించాలని వైవీయూ వైస్ చాన్స్‌లర్ ఆచార్య చింతా సుధాకర్ స్పష్టం చేశారు. గురువారం వైవీయూలో వసతిగృహాల సంక్షేమాధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఎవరెవరు ఏయే విధులు నిర్వహిస్తున్నారనే పరిచయ కార్యక్రమం అయిన తర్వాత తన ఆలోచనా విధానాలను వీసీ సిబ్బందికి వివరించారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలను అందించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సిబ్బందికి విద్యాలయం తరపున రావాల్సిన ప్రయోజనాలను అందేలా చూస్తామన్నారు. ఇదే నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సంక్షేమ అధికారులు హాస్టళ్లను నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అసిస్టెంట్ డా. రెడ్డయ్య, వసతిగృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

వైవీయూ కేంద్రగ్రంథాలయం తనిఖీ

యోగివేమన విశ్వవిద్యాలయంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయాన్ని వీసీ సుధాకర్ గురువారం ఉదయం తనిఖీ చేశారు. పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలిసి కేంద్ర గ్రంథాలయాన్ని పరిశీలించారు. సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని లైబ్రరీ అసిస్టెంట్ బి. ప్రసారావు, ఆర్. విజయ్‌కుమార్‌లను ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన ప్రతి పుస్తకం లైబ్రరీలో ఉండేలా చూస్తామన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : భవన నిర్మాణ కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని స్థానిక హోచిమెన్ భవన్‌లో నిర్వహించిన ఏపీ బిల్డింగ్–కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ కడప జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018 నుంచి ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్ విడుదల చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోరు నిర్వీర్యం చేయరాదన్నారు. ఈ సమావేశంలో ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి ఉద్దె.మద్దిలేటి, జిల్లా నాయకులు లింగన్న, బాలాజీ, రామాంజనేయులు నాగేశ్వరరావు, సిద్దయ్య, జోసఫ్, భాస్కర్ పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌కు రెగ్యులర్ ఏఈని నియమించాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : నగర పరిధిలోని కేసీ కెనాల్ పర్యవేక్షణకు రెగ్యులర్ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) ను తక్షణమే నియమించాలని సీపీఐ నగర కార్యదర్శి ఎస్ వెంకట శివ కోరారు. గురువారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేసీ కెనాల్ పరిధిలో ఖాళీగా ఉన్న ఇద్దరు వర్క్ ఇన్‌స్పెక్టర్లను, 12 మంది లస్కర్ల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఆదినిమ్మాయపల్లి ఆనకట్ట నుంచి నానా పల్లె వరకు గల కడప పరిధిలోని కేసీ కెనాల్ పర్యవేక్షణకు అసిస్టెంట్ ఇంజనీర్ పరిధిలో తగినంత మంది సిబ్బంది లేక కేసీ కెనాల్ స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. కడప నగరంలో దాదాపు 5 కిలోమీటర్ల మేర కేసీ కెనాల్ ఉంటే అందులో పేరుకుపోయిన మురుగుతఊఅధ్వానంగా ఉందని విమర్శించారు. కడపలోని ఏఈ కార్యాలయం తలుపులు తెరిచి ఫిర్యాదులు స్వీకరించే యంత్రాంగం ఉండేటట్లు రెగ్యులర్ ఏఈని నియమించాలన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు సరికాదు

కడప వైఎస్సార్ సర్కిల్ : విద్యుత్ చార్జీలపెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపీ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు పటాన్ మహమ్మద్ అలీ ఖాన్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రజలను విద్యుత్ చార్జీ లపై అదనపు రుసుముల పెంపు పేరుతో నిరంతరంగా దోపిడీ చేస్తున్నాయని ధ్వజమెత్తారు.

ఘనంగా కుంభాభిషేక మహోత్సవం


కుంభాభిషేక మహోత్సవాల్లో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, నాయకులు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని అనంతపురం పంచాయితీ లక్ష్మీపాలెం గ్రామంలో గల శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న సంప్రోక్షణ, కలశస్థాపన, కుంభాభిషేక మహోత్సవాల్లో గురువారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయ ఆవరణ నుండి ఎమ్మెల్సీకి పూర్ణకుంభ స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఆలయంలోని విమాన గోపురం, రాజగోపురం జీర్ణమై శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో నూతన విమాన గోపురం, రాజగోపురం నిర్మాణానికి, అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన రూ.66 లక్షలు నిధులు మంజూరు చేశారని తెలిపారు. అంతేకాకుండా నూతన రథం తయారీకి, కోనేరు ఆధునీకరణకు రూ.1.20 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే వీటి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అంతకు ముందు ఆలయంలో మహాసంకల్పం, ప్రధాన వ్యాసహోమం, ప్రాణప్రతిష్ట హోమం, మహా పూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి, అడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణ, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌కుమార్, ఉప సర్పంచ్ కుప్పాలరమణ, ఆలయ కమిటీ చైర్మన్ మెంటా అశోక్‌కుమార్, దేవాదాయశాఖ కార్య నిర్వహణాధికారి సి.శివయ్య, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ

బద్వేలు : పోరుమామిళ్ళ మండలంలోని ముద్దంవారిపల్లె గ్రామ సమీపంలోని వాగుపై కోటి రూపాయల ఈఏసీ నిధులతో బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మాణంతో పలు గ్రామాలకు రవాణా సౌకర్యం ఏర్పడుతుందని, ప్రజల విన్నపం మేరకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించామని, మూడు నెలల్లో వీటిని ఇంజనీరింగ్ అధికారులు పూర్తి చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి సలహాదారు నాగార్జునరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్‌చైర్మన్ కె.రమణారెడ్డి, ఎంపీటీసీ వెంగల్‌రెడ్డి, ఈఈ నాగరాజు, డీఈ అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

బ్లడ్‌స్టోరేజ్ యూనిట్‌ను సద్వినియోగం చేసుకోండి..

పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన బ్లడ్‌స్టోరేజ్ యూనిట్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రిలో బ్లడ్‌స్టోరేజ్ యూనిట్‌ను సందర్శించారు. ప్రైవేటు ఆసుపత్రుల అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి ఎన్నో ఏళ్ళుగా బ్లడ్ స్టోరేజ్ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని అభ్యర్థించారని తెలిపారు. తనతో పాటు ఎంపీ వైఎస్అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి యూనిట్‌ను మంజూరు చేశామన్నారు. ఈ సందర్భంగా కళ్యాణ్‌చక్రవర్తిని ప్రశంసించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కమిటీ ఎన్నిక


మాట్లాడుతున్న సుబ్బరాయుడు

ప్రొద్దుటూరు : మండలంలోని పెన్నానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ పట్టణ అధ్యక్షుడిగా బి.రామయ్య, కార్యదర్శిగా మధు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నిర్మల, ఉపాధ్యక్షుడిగా వెంకటలక్షుమ్మ, నారాయణమ్మ, నాగరాజు, గురుమూర్తి, ఉప ప్రధాన కార్యదర్శిగా రవిప్రసాద్, కార్యదర్శులుగా రూబెన్, సురేష్, ప్రమీలరాణి, నారాయణమ్మ, కోశాధికారిగా బోదనం చిన్న ఓబులేసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు సమాజ అభివృద్ధిలో, ప్రజారోగ్య బాధ్యతల్లో మున్సిపల్ కార్మికుల పాత్ర అత్యంత కీలకమైనదని తెలిపారు. కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం ఉద్యమించాలని పేర్కొన్నారు.

భూ అక్రమార్కులను కట్టడి చేయాలి

పోరుమామిళ్ల : మండలంలో భూ అక్రమార్కులను కట్టడి చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పిడుగు మస్తాన్, కార్యవర్గ సభ్యులు కేశవ, సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం పోరుమామిళ్లలో జరిగిన ఆ పార్టీ జనరల్‌బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు జరపకపోవడంతో కొంతమంది వంక, వాగు పోరంబోకు, చెరువు లోతట్టు భూములు, దేవాదాయ, ఇనాం, వక్ఫ్ భూములు ఆక్రమించుకుంటున్నారన్నారు. ఇవి తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. డీకేటీ భూముల అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయన్నారు. వందల ఎకరాలు ఆక్రమించుకున్నవారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. సమావేశంలో సీపీఐ నాయకులు చెన్నయ్య, రేణుకమ్మ, శ్రీనివాసులు, షాహిదా, గురమ్మ, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

రతనాల వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో రతనాల వేంకటేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణ పర్వదిన సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున స్వామివారి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా గజమాల, తులసీమాలతో అలంకరించారు. అలాగే లలితాదేవికి, శ్రీదేవి భూదేవి సమేత రతనాల వేంకటేశ్వర స్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు, విష్ణుసహస్రనామ ప్రారాయణం చేసి భక్తి గీతాలను ఆలపించారు.

కార్మికులకు ఎమ్మెల్యే అండ పుష్కలం

ప్రొద్దుటూరు : మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎల్లవేళలా అండగా ఉంటున్నారని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు చంటి, ప్రధాన కార్యదర్శి సాల్మన్ తెలిపారు. యువగళం పాదయాత్రలో కార్మికురాలు గౌరి ఎమ్మెల్యేకి రూ.5లక్షల ఇచ్చానని చెప్పడంపై వారు స్పందించారు. ఏనాడూ కార్మికుల నుంచి ఆయన డబ్బు ఆశించలేదని తెలిపారు. ఏ కార్యక్రమం జరిగినా ఆయన తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో వేతనాలు మంజూరులో జాప్యం జరిగితే ఎమ్మెల్యే తన సొంత డబ్బును వెచ్చించి ప్రభుత్వం ఇచ్చిన తర్వాత తీసుకున్నారన్నారు. కరోనాలో ఒక్కో కార్మికునికి రూ.5వేలు నగదు ఇవ్వడంతో పాటు నిత్యావసర సరుకులు అందించారన్నారు. ఎన్నో సందర్భాల్లో ఎమ్మెల్యే తమకు వ్యక్తిగతంగా సాయం చేశారని చెప్పారు. టీడీపీ మాజీ కౌన్సిలర్ తాటి శ్రీనివాసయాదవ్ ప్రోద్బలంతోనే కార్మికురాలు ఈ విధంగా చెప్పిందన్నారు. సమావేశంలో కార్మికులు లక్ష్మీదేవి, విజయకుమార్ పాల్గొన్నారు.